# కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు

- గరీబోళ్లకు మేలుచేయని బీజేపీ ప్రభుత్వం
- మోదీ సిలిండర్ ధర పెంచుతూ పోతాడు.. కేసీఆర్ 400కే మీకిస్తాడు
- కేసీఆర్ బీమా.. ఓ మానవీయ పథకం
- నియోజకవర్గంలో సాగునీరు లేక ఒక్క ఎకరం కూడా ఎండొద్దన్నదే నా లక్ష్యం
- చెక్‌డ్యాంలు నిర్మించి రెండు పంటలకు నీటి సౌకర్యం కల్పించా..
- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- వేల్పూర్ మండలంలో ఎన్నికల ప్రచారం


వాడిలో మంత్రి వేములకు వలగొడుగు, బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు


వేములకు మంగళహారతి ఇస్తూ స్వాగతం పలుకుతున్న మహిళ

వేల్పూర్, నవంబర్ 5 : కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ మాయమశ్చీంద్ర మాటలేనని, అవి విని మోసపోవద్దని బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ, కొత్తపల్లి, వాడి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల్లో వలగొడుగులు, బోనాలతో రైతులు, మహిళలు, గ్రామప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చెప్పేవన్నీ మాయ మాటలేనని, దానికి నిదర్శనం కర్ణాటకలో మోసపోయిన ప్రజలేనని పేర్కొన్నారు. కర్ణాటకలో గెలిస్తే ఏడు గంటల కరెంట్‌ను పది గంటలకు పెంచుతామని హామీనిచ్చి, ఉన్న ఏడు గంటల్లో ఐదు గం టలు కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. పొద్దున, రాత్రి కరెంట్ ఇస్తూ మళ్లీ పాతరోజులను కాంగ్రెస్ పార్టీ గుర్తు చేస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలకు వచ్చి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాక ముందు పదేండ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని, అప్పుడెందుకు ఈ పథకాలన్నీ అమలుచేయలేదని వేముల ప్రశ్నించారు. దేశంలో మరో నాలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అక్కడ చేసిందేమీలేదన్నారు. ప్రధాని మోదీ గ్యాస్ ధరను పన్నెండు వందలకు పెంచాడని, ఇంకా పెంచుతాడని, ఎంత పెంచినా కేసీఆర్ మాత్రం రూ.400 లకే సిలిండర్ ఇప్పించి, మిగిలిన భారాన్ని భరిస్తాడని తెలిపారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా మానవీయ కోణంలో కేసీఆర్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టనున్నారని చెప్పారు. భూమి లేని వారింట్లో కూడా కుటుంబ పెద్ద మరణిస్తే బీమా కింద ఐదు లక్షల రూపాయలిచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకుంటారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే రేషన్ కార్డుపై సన్నబియ్యం అందిస్తామని తెలిపారు. పింఛన్ రూ.3 వేలకు పెంచి ప్రతి యేడాది ఐదు వందల చొప్పున పెంచుతూ ఐదు వేల పింఛన్ అందిస్తారన్నారు. కొత్త బీడీ పీఎఫ్ వచ్చిన వారికి కూడా బీడీ పింఛన్ కోసం సీఎం కేసీఆర్‌కు విన్నవిస్తే ఒప్పుకున్నారని తెలిపారు. కొత్తపల్లి, చింతలూర్ మీదుగా డబుల్ రోడ్డు వేయించానని, వాగుల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించానని మంత్రి తెలిపారు. ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచులు ఏనుగు శ్వేతా గంగారెడ్డి, నితీశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజశేఖర్, కోటపాటి నర్సింహనాయుడు, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగధర్, అంక్సాపూర్ రాజేందర్‌రెడ్డి, మిట్టాపల్లి మహిపాల్, నల్ల రమేశ్, ఏనుగు గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ లింబారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## సాగునీటికి ఢోకాలేదు..

చెరువుల్లో నీళ్లు లేక పంటలు పండడం లేదని, గ్రామస్తులు బాధపడితే సైకిల్ మోటరుపై వెళ్లి చెరువులను, పంట పొలాలను పరిశీలించానని తెలిపారు. పరిష్కారం కోసం చింతలూర్ వద్ద వాగులో చెక్‌డ్యామ్ నిర్మించి గేటు ఏర్పాటు చేసి వరద పచ్చలనడ్కుడ చెరువులోకి వచ్చేలా చేశానన్నారు. దీంతో చెరువులోకి ఇప్పటికీ నీళ్లు వస్తున్నాయని తెలిపారు. చెరువు ఆయకట్టుకా కుండా వాగు ఆయకట్టు రైతులకు కూడా సాగునీటి ఇబ్బందిని తీర్చేందుకు పచ్చలనడ్కుడ వైపు ఒక చెక్‌డ్యాం, కిందివైపు మరొక చెక్‌డ్యాం నిర్మించామని, దీంతో గ్రామంలో సాగునీటికి ఢోకా లేకుండా పోయి రెండు, మూడు పంటలు పండిస్తున్నారని వివరించారు. నియోజకవర్గంలో ఒక్క ఎకరం కూడా సాగునీరు లేక ఎండిపోకూడదన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ప్యాకేజీ 21తో ఎస్సారెస్పీకి దూరంగా ఉన్న వేల్పూర్ మండలంలోని పలు గ్రామాలు, భీమ్‌గల్ మండలం, మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల గ్రామాలకు సాగునీటి ఇబ్బందులు తీరిపోతాయన్నారు. మనం చేసిన పనులతో పది తరాలు బతికి బాగుపడాలనేదే తన తపన అని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి అన్ని నిత్యావసరాల ధరలు పెరిగేందుకు బీజేపీ కారణమైందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గరీబోళ్లకు మేలు చేయదన్నారు. వాడి, కొత్తపల్లి గ్రామానికి కలిపి సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తానని గ్రామస్తులకు మంత్రి హామీ ఇచ్చారు.

# జోరుగా బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం


దొంకల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు,


హాసాకొత్తూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, కార్యకర్తలు

కమ్మర్‌పల్లి, నవంబర్ 5 : బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం జోరుగా సాగుతోంది. గ్రామాల్లో బూత్‌ల వారీగా నాయకులు, కార్యకర్తలు ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఓటర్లకు వివరిస్తున్నారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు.

**మోర్తాడ్‌లో..**

మోర్తాడ్, నవంబర్ 5: మోర్తాడ్ మండలంలోని పలు గ్రామాల్లో బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తరపున పార్టీ నాయకులు ఆదివారం ప్రచారాన్ని ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీ, జడ్పీటీసీలు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలో అడిగినవి, అడగని అభివృద్ధి పనులు చేయించి జిల్లాలోనే మోర్తాడ్ మండలాన్ని ఒక స్థానంలో నిలిపిన ప్రశాంత్‌రెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

**బాల్కొండలో..**

బాల్కొండ, నవంబర్ 5: బాల్కొండ మండలంలోని గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించా రు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని ప్రజలు ఆదరించాలని కోరారు.

# బీజేపీ నాయకులు.. నీచ రాజకీయాలు మానుకోండి

**మోర్తాడ్ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్**


గులాబీ కండువాలతో ధర్మోరా ముదిరాజ్ యువకులు

మోర్తాడ్, నవంబర్ 5: మోర్తాడ్ మండలంలో గెలవలేమని తెలిసి బీజేపీ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజల మన్ననలు పొందేలా వ్యవహరించి ఎన్నికల బరిలో కొట్లాడాలని ఎంపీపీ శివలింగుశ్రీనివాస్ అన్నారు. మండలంలోని ధర్మోరా గ్రామంలో ముదిరాజ్ యువకులకు ఆదివారం గులాబీ కండువాలు కప్పిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ధర్మోరా గ్రామమంతా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధికి మద్దతుగా నిలుస్తున్నట్లు తీర్మానాలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ముదిరాజ్ యువకులతో మాట్లాడుతామని పిలిచి కండువాలు కప్పి బీజేపీలో చేరినట్లు తప్పుడు ప్రచారాలు చేసుకోవడం విడ్డూరమన్నారు. పదేండ్ల పాటు నియోజకవర్గంలో బీజేపీ నాయకులు ఒక్క గ్రామంలో తిరగకుండా ఒక్క అభివృద్ధి పని చేయకుండా ఓట్ల కోసం వచ్చి పనికిమాలిన రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా తప్పుడు రాజకీయాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుగ్గెన రాజేందర్, ముదిరాజ్ యువకులు పాల్గొన్నారు.

## యువ రచయిత్రుల సమ్మేళనంలో వక్తగా వైష్ణవి

ఏర్గట్ల, నవంబర్ 5: హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనంలో ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ గ్రామానికి చెందిన యువ రచయిత్రి వైష్ణవి వక్తగా పాల్గొని అందరి మన్ననలు పొందింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు సాహిత్యం, కవితలు, కథలు ఎలా రాయాలి, పాటించాల్సి నియమాలు తదితర అంశాలను వివరించింది. సాహిత్య పరమైన అంశాలపై తాను ఎలా పట్టు సాధించినట్లు, ఇప్పటి వరకు రాసిన పుస్తకాలను తెలిపింది. చక్కని ప్రసంగం అందించిన వైష్ణవిని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి చెన్నయ్య సన్మానించారు.


వైష్ణవిని సన్మానిస్తున్న అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివా రెడ్డి, కార్యదర్శి చెన్నయ్య

## నిండుకుండలా ఎస్సారెస్పీ

మెండోరా, నవంబర్ 5 : శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వచ్చిచేరుకోవడంతో నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి ఈ సీజన్‌లో 200.362 టీఎంసీల వరద వచ్చి చేరింది. దీంతో మిగులు జలాలను దిగువ గోదావరి, కాలువలు, ప్రాజెక్టు ఆయకట్టుకు 139.519 టీఎంసీల నీటిని ఇప్పటికే విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1089.30 అడుగుల (81.177 టీఎంసీలు) వద్ద ఉన్నది. కాకతీయ కాలువకు 4,500 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 100 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది.

**శ్రీరాంసాగర్‌గా నామకరణం చేసి నేటికి 45 ఏండ్లు**

ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేస్తున్న ఎస్సారెస్పీకి 'శ్రీరామసాగర్' అని నామకరణం చేసి నేటికి 45 ఏండ్లు పూర్తయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నుంచి ఈ ప్రాంతాన్ని పోచంపాడ్‌గా పిలిచారు.